




TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ

# శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 సంచిక : 167 ఎడిటర్ : పోలగోని రాజేష్ శుక్రవారం 22 నవంబర్ - 2024 పేజీలు : 8 వెల : 04/-


## మాకు తెలిసింది మానవత్వం..

### ప్రజాస్వామ్యం మా డీఎన్ఏ..!!



**ఢిల్లీ / శాసనసభ :** యుద్దానికి, ఘర్షణలకు ఇది సమయం కాదన్నారు ప్రధాని మోదీ. గయానా పార్లమెంటులో ప్రసంగించిన ఆయన ప్రపంచ శాంతికోసం ప్రతి ఒక్కరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.శ్రీలంక, లేదా మాల్దీవ్స్ ఇలా ఏ దేశం సంక్షోభంలో కూరుకుపోయినా భారత్ ఆ దేశాలకు అండగా నిలిచిందని, ఎప్పుడూ కూడా స్వార్థం కోసం చూడలేదని మోదీ చెప్పారు."నేపాల్ నుంచి టర్కీ, సిరియా వరకు ఏ దేశంలో భూకంపాలు సంభవించినా.. ఆ దేశాలకు సహాయం చేయడంలో లేదా స్పందించిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది.

మిగతా »»3లో

# రేవంత్ రెడ్డిపై పరువు నష్టం కేసు

## బీజేపీ నేత వాంగ్మూలం నమోదు చేసిన కోర్టు



- ఎన్నికల ప్రచారంలో రిజర్వేషన్లు ఎత్తేస్తారని ప్రచారం చేశారని పిటిషన్
- పరువు నష్టం కేసు వేసిన బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు
- వెంకటేశ్వర్లు వాంగ్మూలం నమోదు చేసిన కోర్టు

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌పై ఈరోజు నాంపల్లి హైకోర్టులో విచారణ జరిగింది. బీజేపీకి ఓటు వేస్తే రిజర్వేషన్లను ఎత్తేస్తారని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాసం వెంకటేశ్వర్లు కోర్టుకు వెళ్లారు. సీఎంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలో ఈరోజు వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.ఈ ఏడాది మే నెలలో జరిగిన లోక్ సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన అబద్ధపు ప్రచారం వల్ల తమ పార్టీకి నష్టం జరిగిందని బీజేపీ నేతలు మండిపడ్డారు.ఈ క్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. మే 4వ తేదీన కొత్తగూడెం సభలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ నేత పరువు నష్టం దావా నేపథ్యంలో కోర్టు రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది.

### ఈ సంస్థ ద్వారా రానున్న మూడేళ్ళలో

## 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు



- రఘువంశీ ఏరోస్పేస్ కొత్త కారాగార నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన
- శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో శంకుస్థాపన చేసిన మంత్రి
- నూతన ఎంఎస్ఎంఈ విధానం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తామన్న మంత్రి

3

### రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా నిలిచిపోయిన విద్యుత్... బీజేపీ చురక



- కరెంట్ కోతకు అదానీ పవర్, మోదీ పవర్ కారణమన్న రాహుల్ గాంధీ
- పక్కనే ఉన్న జైరాం రమేశ్ విద్యుత్ ప్లగ్‌ను తీసేసి ఉంటారని బీజేపీ చురక
- అదానీ వ్యవహారాన్ని రాహుల్ గాంధీ వినియోగించుకుంటున్నారని విమర్శ

మిగతా »»3లో

### హైకోర్టులో బీఆర్ఎస్‌కు భారీ ఊరట...

## పాలమూరు ధర్నాకు అనుమతి



- ఈ నెల 25న తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతి
- వెయ్యి మంది రైతులతో ధర్నాకు అనుమతించిన హైకోర్టు
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయం

మిగతా »»3లో

### లక్ష కోట్ల అవినీతి అన్న రేవంత్ రెడ్డి...

## కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?



## అమెరికా కేసు ఎఫెక్ట్...

### 'అదానీ'కి షాకిచ్చిన కెన్యా ప్రభుత్వం




- ఎయిర్‌పోర్ట్, విద్యుత్ సరఫరా లైన్ల కాంట్రాక్టును రద్దు చేసిన కెన్యా
- ఈ మేరకు ప్రకటన చేసిన కెన్యా అధ్యక్షుడు విలియం రూటో
- తొలుత ముప్పై ఏళ్లకు ఒప్పందం కుదుర్చుకున్న కెన్యా

మిగతా »»3లో

### నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఉద్యోగాలు ఇచ్చామని

## రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారం



- బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన పరీక్షల్లో కానిస్టేబుల్స్ ఎంపికైనట్లు వెల్లడి
- తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరబోతున్నారన్న హరీశ్ రావు
- వారిని రేవంత్ రెడ్డి తన ఖాతాలో వేసుకుంటారేమోనని చురక

3

# ఈ నెల 29న తెలంగాణ

## వ్యాప్తంగా దీక్షా దివస్



- 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్న కేటీఆర్
- ఈ దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందన్న కేటీఆర్
- కరీంనగర్‌లో దీక్షా దివస్‌లో పాల్గొననున్న కేటీఆర్

మిగతా »»3లో

## అమెరికాలో అదానీపై కేసు...

### స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



- ఆడబిడ్డకో న్యాయం... అదానీకో న్యాయమా? అని ప్రశ్న
- ఆధారాలు లేకపోయినా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేశారన్న కవిత
- అదానీపై ఆధారాలు ఉన్నప్పటికీ అరెస్ట్ చేయడం లేదని ఆగ్రహం

3

### ఏపీలో పింఛన్‌దారులకు కూటమి సర్కారు శుభవార్త



3

### లగచర్ల ఘటనపై స్పందించిన

## జాతీయ మానవహక్కుల కమిషన్

**శాసనసభ / హైదరాబాద్ :** లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది.పరిశీలన కోసం లగచర్లకు బృందాన్ని పంపాలని నిర్ణయించింది.

**లగచర్లలో ఏం జరిగిందంటే?**

మిగతా »»3లో



శాసనసభ
తెలుగు దినపత్రిక


# సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్



శాసనసభ / హైదరాబాద్ : కొద్ది రోజులుగా సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు రాంగ్ రూట్,విత్‌ఔట్ హెల్మెట్, మోడీఫైడ్ సైలెన్సర్, మల్టి టోన్ సైరన్, బ్లాక్ ఫిల్మ్,అనధికారిక స్టిక్కర్ వంటి వాటి పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.ఈ రోజు సంతోష్ నగర్ ప్రధాన రహదారి పై ఇన్స్ స్పెక్టర్ నర్సింహా నాయక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రాంగ్ రూట్ డ్రైవింగ్,హెల్మెట్ లేకుండా ఉన్న 167 కేసులు నమోదు చేశారు. సీటు బెల్ట్ పెట్టుకోని కారు డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మీడియా తో మాట్లాడుతూ..వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారుల పై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని కుటుంబాలు వీదిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. ఈ రోజు తనిఖీలలో ఓ వాహనానికి ఎమ్మెల్యే స్టికర్ పెట్టుకుని సైరన్ పెట్టుకొని వెల్లుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి పై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరు కూడా ఇలా సైరన్ ఉపయోగించి పబ్లిక్ ను భయబ్రాంతులకు గురి చేయొద్దని సూచించారు.ఇదిలా ఉంటే.. సికింద్రాబాద్.. అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు చేశారు సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీ ఎఫ్ పోలీసులు. హర్యానకు చెందిన రణ్వీర్ సింగ్ ను అరెస్ట్ చేసి అతడి నుండి 21లక్షల విలువైన 26నర తులాల బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్ తెలిపారు. ఢిల్లీలో డ్రైవర్‌గా పని చేస్తూ దొంగతనాలు ప్రవృత్తిగా మార్చుకున్న హర్యాణకు చెందిన రణ్వీర్ సింగ్ గతంలోనే డిల్లీ జీఆర్పీ, కర్ణాటక జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేయగా జైల్ శిక్ష అనుభవించినట్లు విచారణలో తేలిందని డీఎస్పీ పేర్కొన్నారు. హర్యానకే చెందిన మరో నలుగురు యువకులతో కలసి ముఠాగా ఏర్పడి సికింద్రాబాద్ జీఆర్పీ పరిదిలో ప్రయాణికుల నుండి బంగారు ఆభరణాల చోరీ. నాలుగు కేసులలో నిందితులుగా తేలినట్లు వెల్లడించారు.

# అమ్మ భాష నేర్చుకున్న తర్వాత ఇంగ్లీష్ నేర్చుకోండి..



శాసనసభ / హైదరాబాద్ : అమ్మ భాష నేర్చుకున్న తర్వాత ఇంగ్లీష్ నేర్చుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. హైదరాబాద్ శిల్పారామంలో నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ కళా ప్రదర్శనలో భాగంగా..వెంకయ్య నాయుడు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రేపు లోక్ మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. కాగా.. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. లోక్ మంథన్ కార్యక్రమంను భాగ్యనగర్ లో నిర్వహించడం చాలా సంతోషకరం అన్నారు. మళ్ళీ తిరిగి మన మూలాలకు వెళ్ళాలన్నారు. మన సాంస్కృతిక వారసత్వాలను కాపాడుకోవాలన్నారు. మన కళలు, సంస్కృతులు, వాయిద్యాలను రక్షించుకోవాలని తెలిపారు. మన సంస్కృతిని, మన భాషను, మన సంప్రదాయాలును మర్చిపోయామన్నారు. ప్రకృతిని ప్రేమించే పవిత్ర మైన జాతి, హిందూ ధర్మం మనదని తెలిపారు. ఇంగ్లీష్ వాడు ఆర్థికంగా దోచుకోవడమే కాదు మన మనస్సును కూడా దోచుకుని వెళ్ళిపోయాడన్నారు.దేవుడి దగ్గర పోవాలని అంటే ఇంగ్లీషు రావాలనే షరతులేమి లేవని దేవుడు చెప్పారని అన్నారు. సమయం వచ్చినప్పుడు ఎవరైనా రావాల్సిందే అని దేవుడు చెప్పారని తెలిపారు. ప్రముఖ వ్యక్తులు మాతృభాషలోనే చదువుకున్నారన్నారు. మోడీ ఇంగ్లీష్ మీడియం మొఖమే చూడలేదన్నారు. మనం భారతీయులం, మనం హిందువలమని గర్వంగా చెప్పుకోవాలని తెలిపారు. ఇంగ్లీష్ వ్యామోహం మంచిది కాదన్నారు. అమ్మ భాష నేర్చుకున్న తర్వాత ఇంగ్లీషు నేర్చుకోవాలన్నారు. కుటుంబాలు, పెళ్ళిళ్ళు విచ్చిన్నం అవుతున్నాయని తెలిపారు. కుటంబ వ్యవస్థను పటిష్ఠం చేసుకుందామన్నారు. మనశ్శాంతిగా ఉంటే అనుకున్న పలితాలు సాధించవచ్చని అన్నారు. శిల్పారామంలో ప్రజ్ఞవాహిని ఆధ్వర్యంలో లోక్ మంథన్ పేరుతో కళా ప్రదర్శనల పండుగ నిర్వహిస్తున్నారు. నేటి (గురువారం) నుంచి ఆదివారం దాకా వివిధ అంశాలపై చర్చలు, సమావేశాలు జరగనున్నాయి. 12 దేశాల నుంచి 1500 మందికి పైగా కళాకారులు రాకతో సందడి వాతావరణం నెలకొంది. 120కు పైగా సాంస్కృతిక కార్యక్రమాలకు రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా.. శిల్పారామంలో నాలుగు రోజుల పాటు ఉచితంగా సందర్శన నిర్వహించనున్నారు.

# మత్స్యకారులను రాజకీయంగా విస్మరిస్తున్నారు



శాసనసభ / హైదరాబాద్ : మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మత్స్యకారుల దశపై ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఈటల, మత్స్యకారుల సమస్యలను ప్రతిపాదించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్స్యకారులు భారీ జనాభా కలిగి ఉన్నప్పటికీ, వారికి తగిన రాజకీయ ప్రోత్సాహం లేకుండా పోయిందన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే వారిని ఉపయోగించుకుంటున్నారనే విమర్శను ఆయన వ్యక్తం చేశారు.మత్స్యకారులలో చాలామంది స్వతంత్రంగా ఎదిగినవారేనని, కానీ వారిని రాజకీయంగా ఎవరూ గుర్తించలేదని ఈటల అభిప్రాయపడ్డారు. యాదవులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తమ వృత్తుల ఆధారంగా సభ్యత్వాలు పొందుతున్నప్పటికీ, మత్స్యకారులకు మాత్రం ఇది సాధ్యం కావడం లేదన్నారు. వృత్తి మీద ఆధారపడి బతికే వారికే సభ్యత్వం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మత్స్యకారులు సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ సహకారాన్ని పొందాలని సూచించిన ఈటల, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు.ఎన్ఎఫ్‌డీసీ బోర్డుకు కొంతమందిని తీసుకెళ్లే హామీని ఈటల ఇచ్చారు.ఎల్ఎండీ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల్లో ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటును ఆపడానికి ఎన్నో పోరాటాలు చేశామని ఈటల గుర్తుచేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం తాను పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల్లో సభ్యత్వాన్ని అడిగి తీసుకున్నానని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారుల అభివృద్ధికి రాజకీయాలు, సహకార సంఘాలు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఈటల స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో అద్భుతమైన పాలన అందించింది



శాసనసభ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో అద్భుతమైన పాలన అందించిందని, దేశంలో ఏ రాష్ట్రం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మనం చేసి చూపించామన్నారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అనేక పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులు చేసి చూపించారని ఆయన వ్యాఖ్యానించారు. 18 వేల కోట్ల వ్యవసాయ రుణాలు, ఆర్టీసీ ఉచిత ప్రయాణాలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, 500 రూపాయలకు గ్యాస్, 50 వేల ఉద్యోగాలు లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన అన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీస్కెళ్లాలన్నారు మహేష్ గౌడ్. కాంగ్రెస్ కార్యకర్తలు మన ప్రభుత్వం చేసిన పనులను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు.ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపైన విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలి. అందుకు తగ్గట్టు మన ప్రచారం ఉండాలని ఆయన అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక మందికి కార్పొరేషన్ల పదవులు వచ్చాయని, డీసీసీ అధ్యక్షులకు అందరికి పదవులు వచ్చాయన్నారు. అనుబంధ సంఘాల చైర్మన్ లకు పదవులు వచ్చాయని, ఇంకా చాలా పదవులు ఇవ్వాల్సి ఉందన్నారు మహేష్ కుమార్ గౌడ్. పార్టీ కోసం పని చేసిన అందరికి పదవులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని, రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో పార్టీ అన్ని విధాలుగా గట్టిగా కృషి చేయాలన్నారు. మంచి ఫలితాలు రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు.

# పోలీసులపై చర్యలు తీసుకోండి.. హైకోర్టులో పట్నం శృతి పిటిషన్..



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో లగచర్ల ఘటన సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇవాళ లగచర్ల ఘటనలో పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ నమోదు అయ్యింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్త పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేశారని సతీమణి పట్నం శృతి పిటిషన్ ధాఖలు చేశారు. దీనిపై పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పట్నం శృతి పిటిషన్ పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్టుచేసే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు పాట్టించలేదని పేర్కొన్నారు. డి.కె. బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును శృతి పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా ఐజీ వి. సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్స్పెక్టర్ శ్రీధర్రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ చేర్చారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ పట్నం శృతి కోరారు. మరి దీనిపై హైకోర్టు ఎలా స్పందిస్తుంది అనేదానిపై ఉత్కంఠ నెలకొంది.తాజాగా లగచర్ల ఘటనపై పట్నం మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. లగచర్లలో భూసేకరణకు సంబంధించిన విచారణకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో ఎ1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కీలక పోషించారని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు వెల్లడించారు. ఏ-2గా ఉన్న సురేశ్ ఇతర నిందితులను నైతికంగా సహకరించార ఆరోపణలు వున్నాయి. అయితే సురేష్ తో దాదాపు 89 సార్లు ఫోన్ కాల్స్ మాట్లాడారని తెలిపారు. ఈ ఘటన తరువాత నుండి సురేష్ పరారీలో ఉండగా, పోలీసులు అతడి కోసం ముమ్మరంగా గాలించారు. తాజాగా సురేష్ స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోవడం గమనార్హం. సురేష్ లొంగిపోవడంతో లగచర్ల ఘటనపై తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది. పోలీసులు ఆరోపించినట్లుగా సురేష్ ఎవరి పేర్లు బయటపెడతాడు అన్న ఉత్కంఠ నెలకొంది.

# లిక్కర్ కేసులో ఎదురుదెబ్బ.. ట్రయిల్ కోర్టు విచారణపై స్టేకు హైకోర్టు నిరాకరణ




శాసనసభ / న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం పాలసీ కేసులో ట్రయిల్ కోర్టు విచారణపై స్టే విధించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రీ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. విచారణ చేపట్టిన కోర్టు కేజ్రీవాల్ పిటిషన్‌ను కొట్టి వేసింది. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌పై దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై స్పందించాలని ఈడీని కోరింది.లిక్కర్ పాలసీ కేసులో ఈడీ తాజాగా మరిన్ని ఆధారాల్ని సేకరించింది. సేకరించిన ఆధారాలతో అనుగుణంగా కేజ్రీవాల్‌ను విచారణ చేపట్టాలని కోరుతూ ట్రయల్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ట్రయల్ కోర్టు పరిశీలించింది. కేజ్రీవాల్‌పై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ట్రయల్ కోర్టు నిర్ణయం తర్వాత ఈడీ కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఆ సమన్లలో ట్రయల్ కోర్టులో విచారణ కావాలని స్పష్టం చేసింది.ట్రయల్ కోర్టు విచారణపై స్టే విధించలేమని హైకోర్టు తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ 20కి వాయిదా వేసింది. లిక్కర్ పాలసీ కేసులో దాదాపు 6 నెలలు కేజ్రీవాల్ తీహార్ జైల్లో ఉన్నారు. సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తన స్థానాన్ని అతిషికి అప్పగించారు. ప్రస్తుతం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్లనున్నారు.

# చరిత్ర సృష్టించిన "మహా" ఓటర్లు.. దశాబ్ధం తర్వాత ఎక్కువ ఓటింగ్ శాతం..



శాసనసభ / న్యూఢిల్లీ : మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటర్లు చరిత్ర సృష్టించారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో ఏకంగా 65.1 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. 1995 ఎన్నికల్లో 71.5 శాతం నమోదైంది.ఆ తర్వాత ఇప్పుడే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. దశాబ్ధం తర్వాత ఇంతలా ఓటింగ్ శాతం పెరగడం ఇదే తొలిసారి.2004, 2014 ఎన్నికల్లో 63.4 శాతం ఓటింగ్ నమోదైంది. 1995లో అత్యధికంగా 71.5 శాతం ఉన్న పోలింగ్ శాతం, 1999లో 61కి పడిపోయింది. 2009లో 59.7 శాతంగా నమోదైంది. 2014లో 63.4 శాతానికి చేరుకుంది. 2019లో 61.4 శాతంగా నమోదైంది. నిజానికి అధిక ఓటింగ్ అనేది అధికారంలో ఉన్న వారికి ప్రమాదం అని సూచిస్తారు, అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైనప్పటికీ బీజేపీ కూటమికి దెబ్బపడింది. అన్ని సందర్భాల్లో ఓటింగ్ శాతం అనేది కీలకం కాబోదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మహారాష్ట్రలో నక్సల్స్ ప్రభావిత గడ్చిరోలి జిల్లాలో అత్యధికంగా 70 శాతం ఓటింగ్ నమోదైంది. రాజధాని ముంబైలో మాత్రం కేవలం 54 శాతం మాత్రమే నమోదైంది. 2019తో పోలిస్తే(50.67) శాతం కన్నా ఎక్కువగానే ఓట్లేశారు. అర్బన్ ఓటర్లు ఎక్కువగా ఓటేయకపోవడం గమనార్హం. ముంబైలోని కలాబా సీటులో కేవలం 44.5 శాతం మాత్రమే ఓటింగ్ నమైదైంది. ముంబైలోని సబర్బన్‌లో 39.34 శాతం పోలింగ్ నమోదైంది. 46 స్థానాలున్న మరత్వాడా రీజియన్‌లో 20 స్థానాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం విశేషం. ఈ 20 స్థానాల్లో 17 మంది బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఎమ్మెల్యేలే ఉన్నారు.

# దేశ సంపదను అదానీకి అప్పగిస్తున్నారు




శాసనసభ / హైదరాబాద్ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కేంద్రంలోని బీజేపీ పెద్దలపై తీవ్ర విమర్శలు చేశారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు,దేశ సంపదను అదానీకి అప్పగిస్తున్నారని ఆరోపించారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కేవలం నిబంధనల మేరకు ఒప్పందాలు చేసుకుంటుందని, పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రావడానికి ఎలాంటి ఆంక్షలు లేవని స్పష్టం చేశారు.రాష్ట్ర సంపద పూర్తిగా ప్రజలకే చెందాలని తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్న విక్రమార్క, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. ఇక అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో బిలియన్ డాలర్ల లంచం, మోసం ఆరోపణలతో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అదానీపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదానీపై విచారణ జరగదని, ప్రధాని మోడీ సహా కేంద్ర పెద్దల మద్దతు ఉందని రాహుల్ గాంధీ విమర్శించారు.

# నా అదృష్టం: కోటి దీపోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



శాసనసభ /హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ మైదానంలో ఎన్టీవీ-భక్తి టీవీ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్న కోటి దీపోత్సవ కార్యక్రమానికి గురువారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశిష్ట అతిథిగా హాజరయ్యారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతితోపాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి సీతక్క కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోటి దీపోత్సవ వేడుకలో జ్యోతి ప్రజ్వలన చేశారు. కోటి దీపోత్సవంలో పూరీ జగన్నాథునికి రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామికి రాష్ట్రపతి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలి కార్తీక దీపాన్ని రాష్ట్రపతి ముర్ము వెలిగించారు. కోటి దీపోత్సవంలో పాల్గొన్న సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు.దీపాలతో ప్రతి కార్యక్రమాన్ని ప్రారంభించడం మన సంప్రదాయమని ద్రౌపది ముర్ము అన్నారు. కోటి దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్తీక మాసంలో అందరూ శివున్ని పూజిస్తారన్నారు. అసత్యంపై సత్యం గెలిచిన పండగ అని అన్నారు. తెలుగు నేలపై కార్తీక మాసం వేళ కోటి దీపోత్సవం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరూ ఒక్కటై దీపాలు వెలిగించడం ఏకత్వాన్ని సూచిస్తుందని వ్యాఖ్యానించారు.యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం, పూరీ జగన్నాథుని పూజలో పాల్గొనడం తన అదృష్టమన్నారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. 13వ రోజైన నవంబర్ 21న కోటి దీపోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. గురువారంనాడు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ ప్రవచనామృతం వినిపించారు. వేదికపై పూరీ జగన్నాథ హారతి, నృసింహ రక్షా కంకణ పూజ నిర్వహించారు.యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కళ్యాణాన్ని వీక్షించిన భక్తులు భక్తపారవశ్యంలో మునిగిపోయారు. వేష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. చివరలో లింగోద్భవం, సప్తహారతులు, మహా నీరాజనాలతో 13వ రోజు కోటి దీపోత్సవం విజయవంతంగా ముగిసింది. కాగా, గత కోటి దీపోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే.

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక



# ఈ పోస్ట్ ఆఫీస్ స్కీమ్ లో ఒక్కసారి ఇన్వెస్ట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు ప్రతి నెల రూ. 20,500

ఈ పోస్ట్ ఆఫీస్ స్కీమ్ లో ఒక్కసారి ఇన్వెస్ట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు ప్రతి నెల రూ. 20,500 రిటైర్ అయినా వారు ప్రతి నెలా ఆదాయం పొందే పథకం కోసం చూస్తున్నారా.? అయితే, పోస్ట్ ఆఫీస్ అటువంటి పథకాన్ని అందిస్తోంది. ఇందులో మీరు ప్రతి నెలా ఆదాయం పొందుతారు.పదవీ విరమణ తర్వాత సాధారణ నెలవారీ ఆదాయం ఆందోళన నుండి బయటపడటానికి పోస్ట్ ఆఫీస్ లోని సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (SCSS) ఉత్తమ ఎంపిక. ఈ పథకం వృద్ధులకు సురక్షితమైన, స్థిరమైన నెలవారీ ఆదాయాన్ని అందిస్తుంది. మీరు పదవీ విరమణ చేసి, మీ డబ్బును సురక్షితమైన స్థలంలో పెట్టుబడి పెట్టాలనుకుంటే ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇక ఈ పథకంలో SCSSలో ప్రస్తుత వడ్డీ రేటు 8.2%. ఇది ప్రభుత్వ పథకాలలో అత్యధికం. మీరు ఇందులో గరిష్టంగా రూ. 30 లక్షలు పెట్టుబడి పెడితే, మీకు ప్రతి సంవత్సరం సుమారు రూ. 2,46,000 వడ్డీ లభిస్తుంది. అంటే ప్రతి నెలా దాదాపు రూ. 20,500 మొత్తాన్ని పొందడం కొనసాగిస్తారు. ఈ డబ్బు నేరుగా మీ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయబడుతుంది.ఇంతకుముందు ఈ పథకంలో గరిష్ట పెట్టుబడి పరిమితి రూ. 15 లక్షలు ఉండేది. ఇది ఇప్పుడు రూ. 30 లక్షలకు పెంచబడింది. ఈ పథకం మెచ్యూరిటీ వ్యవధి 5 సంవత్సరాలు. మెచ్యూరిటీ తర్వాత మరో 3 ఏళ్లు పొడిగించుకోవచ్చు. ఈ పథకంలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న భారతీయ పౌరులు మాత్రమే పెట్టుబడి పెట్టవచ్చు. అంతేకాదండోయ్.. 55 నుంచి 60 ఏళ్లలోపు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారు కూడా ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు. పథకం కోసం ఖాతా తెరవడానికి, సమీపంలోని పోస్టాఫీసు లేదా బ్యాంకులో దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ పథకం ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే SCSS కింద కొంత పన్ను ఆదా సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఇది మీ పన్ను బాధ్యతను తగ్గిస్తుంది. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడానికి ముందు దానిలోని అన్ని నిబంధనలు, షరతులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ పథకం మీ పదవీ విరమణకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. మీరు మీ పదవీ విరమణ తర్వాత సౌకర్యవంతమైన, సురక్షితమైన జీవితాన్ని కోరుకుంటే ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయం.




( మొదటి పేజీ తరువాయి )

## ఏపీలో పింఛన్‌దారులకు కూటమి సర్కారు శుభవార్త

పింఛన్‌దారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెన్షన్ల పంపిణీని మరింత సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలలపాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా..మూడో నెలలో ఆ మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం గురువాం ఉత్తర్వులు జారీ చేసిందివృద్ధాప్య పింఛను తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే.. అతడి భార్యకు మరుసటి నెల నుంచే వితంతు పింఛను మంజూరు చేయనున్నారు. కాగా, ప్రస్తుతం పెన్షన్ దారులు రెండు నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునే అవకాశం ఉంది. ఏదైనా కారణాల వల్ల రెండు నెలల పెన్షన్ తీసుకోకపోతే మూడో నెలలో ముందు రెండు నెలల పెన్షన్ చెల్లించేవారు కాదు. కానీ, పెన్షన్ దారుల కోసం కూటమి ప్రభుత్వం తాజాగా ఈ వెసులుబాటును కల్పించింది.ప్రభుత్వ తాజా నిర్ణయంతో మూడు నెలల పెన్షన్ ను లబ్ధిదారులు ఒకేసారి తీసుకునే అవకాశం కలిగింది. ఇక, కుటుంబ యజమాని మరణిస్తే అతడి పెన్షన్ రద్దు అవుతోంది. మృతుడి భార్య వితంతు పెన్షన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. తాజాగా, ఈ నిబంధనను కూడా ప్రభుత్వం మార్చింది.పెన్షన్ తీసుకుంటున్న యజమాని మరణిస్తే.. మరుసటి నెల నుంచి మృతుడి భార్యకు వితంతు పెన్షన్ మంజూరు చేసేలా వెసులుబాటు కల్పించింది. టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలతో పింఛన్ దారులు హర్షం వ్యక్త చేస్తున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నకల్లో హామీ ఇచ్చినట్లుగానే అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే ఎన్డీఏ ప్రభుత్వం పెంచిన పెన్షన్లు అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి నెల 3వ తేదీలోపే పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తుండటం గమనార్హం.

## లక్ష కోట్ల అవినీతి అన్న రేవంత్ రెడ్డి... అతనిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?: కేఏ పాల్

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, సీబీఐ విచారణ జరిపించాలని గతంలో డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి... ముఖ్యమంత్రి అయ్యాక మేఘా కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అయిందని... కానీ మేఘా కృష్ణారెడ్డి ఇప్పుడు సీఎంకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యాడని ఆరోపించారు. కాంగ్రెస్ ఎప్పుడూ ద్వంద్వ విధానాలను పాటిస్తుందని విమర్శించారు.కాళేశ్వరం అవినీతిపై కాగ్ నివేదిక తేటతెల్లం చేసిందని, ఈ ప్రభుత్వానికి దమ్ముంటే కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని సవాల్ చేశారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే సత్వర న్యాయం జరుగుతుందని, కోర్టు విచారణలతో ఏళ్లు పడుతుందన్నారు.

## మాకు తెలిసింది మానవత్వం..ప్రజాస్వామ్యం మా డీఎన్ఏ..!!

సహాయం చేసే గుణం భారత సంప్రదాయం.విస్తరణ వాదాన్ని భారత్ ఎప్పుడూ విశ్వసించదు.అంతరిక్షం,సముద్రం అనే రెండు అంశాలపై అన్ని దేశాల సహకారం ఉండాలి తప్ప ఈ రెండు అంశాల కోసం ఘర్షణ, యుద్ధాలు తగదు. ఈ యుగం యుద్ధాల యుగం కాదు" అని ప్రధాని మోదీ అన్నారు.గయానా దేశ అత్యున్నత పురస్కారం "ది ఆర్డర్ ఆఫ్ ఎక్సలెన్స్"తో ఆదేశ ప్రభుత్వం గౌరవించిన అనంతరం మోదీ పార్లమెంటులో మాట్లాడారు.ప్రపంచ దేశాలు కష్టాల్లో ఉన్నప్పుడు వీలైతే సహాయం చేయడం ఆదేశ ప్రజలకు అండగా ఉండటం అందుకు తగ్గ నిర్ణయాలను మానవీయ కోణంలో తీసుకుంటామని మోదీ చెప్పారు. ప్రజాస్వామ్యం – మానవీయత ముందు అనే నినాదంతో భారత్ ముందుకెళుతోందని విశ్వబంధులా డ్యూటీ చేసుకెళుతోందని మోదీ చెప్పారు.

## నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారం: హరీశ్ రావు

నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గోబెల్స్ ప్రచారం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి... ఇప్పుడు తొమ్మిది నెలలు శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరబోతున్న 8,047 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను కూడా తన ఖాతాలో వేసుకుంటాడేమోనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన పోలీసు పరీక్షల్లో ఎంపికై, ఉద్యోగాలు పొంది తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని, 8,047 మంది పోలీస్ కానిస్టేబుళ్లు విధుల్లో చేరబోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఆ కానిస్టేబుళ్లకు హరీశ్ రావు శుభాకాంక్షలు చెప్పారు.

### లగచర్ల ఘటనపై స్పందించిన జాతీయ మానవహక్కుల కమిషన్

లగచర్లలో ఏం జరిగిందంటే? ఔషధ(ఫార్మా) పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించ తలపెట్టిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఏకంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై ఆయా గ్రామాల రైతులు కర్రలు, రాళ్లతో దాడులకు యత్నించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ త్రుటిలో తప్పించుకోగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను తప్పించేందుకు యత్నించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపైనా దాడి జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్నెల్ల కిందట దుద్యాల మండల పరిధిలో ఔషధ పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టింది. రెవెన్యూ అధికారుల సర్వేలో మొత్తం 1,314.21 ఎకరాల భూమి అవసరమవుతుందని తేల్చారు. హకీంపేట గ్రామంలో పట్టా భూములు 366.34 ఎకరాలు, పోలెపల్లిలో 130.21, లగచర్లలో 156.05 ఎకరాలు కలిపి మొత్తం 676.25 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు.

## ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ పనితీరు భేష్..

శాసనసభ / హైదరాబాద్ : భారతదేశంలో ఎక్కడ ఎలాంటి నేరాలు జరిగినా నిందితులను పట్టుకునేందుకు దోహదపడే వ్యవస్థ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) అని కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.హత్యలు,అత్యాచారాలు, దొంగతనాలతోపాటు నార్కోటిక్, సైబర్, మనీ లాండరింగ్ నేరాలకు పాల్పడిన దోషులను పట్టుకునేందుకు దోహదపడేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సీఎఫ్ఎస్ఎల్ సంస్థను తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఈరోజు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తో కలిసి హైదరాబాద్ రామాంతాపూర్ లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ(సీఎఫ్ఎస్ఎల్), నేషనల్ సైన్స్ ఫోరెన్సిక్ లాబోరేటరీ(ఎన్సీఎఫ్ఎల్), సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ (సీడీటీఐ) సంస్థలను కేంద్ర మంత్రి సందర్శించారు. మధ్యాహ్నం 2 గంటలకు విచ్చేసిన బండి సంజయ్ దాదాపు రెండున్నర గంటలపాటు అక్కడే గడిపారు. ఆయా సంస్థల్లోని ప్రతి విభాగానికి వెళ్లి పరిశీలించారు. అధికారులతో సమావేశమై ఆయా విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలు హైదరాబాద్ లో ఉండటం గర్వకారణమన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి వేలాది కేసుల పరిష్కారానికి ఈ సంస్థలను సంప్రదించడంతోపాటు నేర పరిశోధనకు అవసరమైన ప్రామాణిక పత్రాలను సీఎఫ్ఎల్ఎల్ అందజేస్తోందని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు.తొలుత సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీని సందర్శించిన బండి సంజయ్ ను సంస్థ జాతీయ విభాగం డైరెక్టర్ ఎస్.కే.జైన్, హైదరాబాద్ ఇంఛార్జ్ రాజీవ్ గిరోటీ స్వాగతం పలికారు. ఈ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమైన కేంద్ర మంత్రి



సీఎఫ్ఎస్ఎల్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ఫోరెన్సిక్ డివిజన్, ఆక్సిజన్ ఫోరెన్సిక్ డివిజన్, డీఎన్ఏ, బయాలజీ డివిజన్, నార్కోటిక్, కెమిస్ట్రీ డివిజన్, ఫిజిక్స్ డివిజన్, సైకాలజీ డివిజన్ తోపాటు డాక్యుమెంటేషన్ డివిజన్లను సందర్శించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ కార్యాచరణపై అధికారులను అడిగి తెలుసుకోవడంతోపాటు కేంద్రం నుండి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తగిన ప్రతిపాదనలను కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎన్వీఎస్-ఎస్ ప్రభాకర్ చేతులు మీదుగా సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం ఎన్సీఎఫ్ఎల్, సీడీటీఐ సంస్థలను కేంద్ర మంత్రి సందర్శించారు. అక్కడ సైతం ప్రతి విభాగాన్ని సందర్శించారు. అధికారులతో సమావేశమయ్యారు. ఆయా సంస్థల పనితీరుపై సంబంధిత శాఖ అధికారులు పవర్ పాయింట్ ఇచ్చారు. పోలీసులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, న్యాయవాదులకు ఇప్పటి వరకు 39,167 మందికి సీటీడీఐ అధికారులు ప్రత్యేక శిక్షణనివ్వడంతోపాటు సైబర్ నేరాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్న విషయాన్ని తెలుసుకున్న కేంద్ర మంత్రి సంస్థ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

## అర్ధాంగి అనే మాటకు అర్థం చెప్పిన మహిళ.. తన భర్త ప్రాణాలకు తన ప్రాణం అడ్డేసి..!

శాసనసభ / హైదరాబాద్ : భార్య జీవితానికి సహచరురాలే కాదు, గమ్యానికి ప్రేరణ కూడా. ఆమె ప్రేమ, అనురాగం, బంధం భర్త జీవితాన్ని మరింత విలువైనదిగా మారుస్తాయి.భార్య అంటే కేవలం ఒక పాత్ర కాదు.. ఆమె భర్త ఆనందానికి మూలం, భర్త బాధలను తగ్గించే ఓదార్పు, ప్రతి విజయానికి వెనుక ఉన్న అండగా నిలిచే వ్యక్తి. ఆమె తోడు ఒక కుటుంబాన్ని మాత్రమే కాకుండా, ఒక సంతోషకరమైన ప్రపంచాన్ని నిర్మిస్తుంది. భార్య తన చిన్న చిన్న చర్యలతో కూడా జీవితాన్ని సున్నితంగా, సుందరంగా తీర్చిదిద్దుతుంది. ఆమె ఒక స్నేహితురాలు, మార్గదర్శి, కష్టకాలంలో ధైర్యం ఇచ్చే తోడుగా ఉంటుంది. ఆమె చూపే ప్రేమ, చూపించే నమ్మకం, అందించే మద్దతు మన జీవితానికి నడిచే దారి చూపిస్తుంది. ఒక మాటలో చెప్పాలంటే, భార్య అంటే జీవితపు గుండె చప్పుడు, కుటుంబానికి ప్రాణమని చెప్పచ్చు.అలాంటి ఓ భార్య తన భర్త ప్రాణాలను కాపాడుకోవడానికి తీసుకున్న నిర్ణయం అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఖమ్మం జిల్లాలో మానవత్వం, ప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఘటన ఇది. రఘునాథపాలెం మండలం పెద్ద ఈర్లపూడికి చెందిన ధరావత్ శ్రీనివాస్, ఖమ్మం ఏపీజీవీబీ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగి. ఆయన భార్య లావణ్య ఎల్ఎల్బీ చివరి సంవత్సరం చదువుతుంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరీక్షల కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించగా, కామెర్లతో పాటు కాలేయ సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. దీంతో వారు తీవ్ర



ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్‌లోని వివిధ ఆసుపత్రుల్లో లక్షల రూపాయల ఖర్చుతో మెరుగైన చికిత్సలు చేయించినా ఫలితం కనిపించలేదు. పలు పరీక్షల అనంతరం వైద్యులు కాలేయ మార్పిడి చేయాల్సిందేనని తేల్చి చెప్పారు.కాలేయ దాత కోసం అనేక ప్రయత్నాలు చేసినా ఎక్కడా దాత దొరకలేదు. ఈ క్రమంలో, తన భర్తను ఎలా అయినా రక్షించుకోవాలని పట్టుదలతో లావణ్య తన కాలేయాన్ని దానం చేయాలని నిర్ణయించింది. వైద్యుల సిఫారసుల మేరకు లావణ్యకు అన్ని పరీక్షలు నిర్వహించగా, ఆమె కాలేయం శ్రీనివాస్‌కు సరిపోతుందని నిర్ధారించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో వైద్యులు లావణ్య కాలేయం నుంచి 65 శాతం తీసి విజయవంతంగా శ్రీనివాస్‌కు అమర్చారు. ప్రస్తుతం శ్రీనివాస్, లావణ్య ఇద్దరూ ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. ఈ అరుదైన సంఘటనలో లావణ్య తన భర్తకు పునర్జన్మ ప్రసాదించి, అర్ధాంగి అనే పదానికి నిజమైన అర్థాన్ని తెలిపింది. ఆమె ధైర్యం, త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకంగా మారింది. లావణ్యను నానా విధాలుగా అభినందనలు కురిపిస్తున్నారు.

## అరెస్ట్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదన్న పట్నం శృతి

శాసనసభ / హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో తన భర్త పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయడంపై ఆయన భార్య పట్నం శృతి హైకోర్టులో కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్తను అరెస్ట్ చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు.ఒక వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో అనుసరించే నిబంధనలు పాటించలేద న్నారు.ఈ సందర్భంగా డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె తన పిటిషన్‌లో ఉదహరించారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ,వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌ను చేర్చారు.తన అరెస్టును సవాల్ చేస్తూ పట్నం నరేందర్



రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. లగచర్లలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆయన ప్రజలను రెచ్చగొట్టారని ఆరోపించారు. సంబంధిత వీడియోలను సీడీ రూపంలో కోర్టుకు అందించారు

## అమెరికాలో అదానీపై కేసు... స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

ఆరోపణలపై ఆడబిడ్డకో న్యాయం... అదానీకో న్యాయమా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అఖండ భారతంలో వేర్వేరు న్యాయాలు ఏమిటని ఆమె అభిప్రాయపడ్డారు. అదానీపై అమెరికాలో లంచం ఇవ్వజూపినట్లుగా కేసు నమోదు కావడంతో ఆమె స్పందించారు.ఆధారాలు లేకపోయినప్పటికీ ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ అన్నారు. కానీ ఆధారాలు ఉన్నప్పటికీ అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఎన్నిసార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని నరేంద్రమోదీ... అదానీ వైపే ఉంటారా? అని నిలదీశారు.అఖండ భారతంలో సెలెక్టివ్ న్యాయం అందిస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులను సాక్ష్యాలు లేకుండానే అరెస్ట్ చేసి నెలల తరబడి జైల్లో ఉంచుతున్నారని, కానీ అదానీపై పదేపదే ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదని ఇంగ్లిష్‌లోనూ ఆమె ట్వీట్ చేశారు. అదానీపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ఆపుతోంది ఎవరు? అని ప్రశ్నించారు.కవిత చాలా రోజుల తర్వాత ఎక్స్ వేదికగా స్పందించారు. జైలు నుంచి బయటకు వచ్చాక ఆమె ఆగస్ట్ 29న సత్యమేవ జయతే అని ట్వీట్ చేశారు. ఆ తర్వాత తన తండ్రి కేసీఆర్‌ను కలిసిన ఫొటోను ట్వీట్ చేశారు.

## ఈ నెల 29న తెలంగాణ వ్యాప్తంగా దీక్షా దివస్

ఈ నెల 29న తెలంగాణలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షా దివస్ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.తాను కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్‌లో పాల్గొంటానని వెల్లడించారు.తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివస్ నిలుస్తుందన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు.ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటించేలా చేసిందన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందన్నారు.

## హైకోర్టులో బీఆర్ఎస్‌కు భారీ ఊరట... పాలమూరు ధర్నాకు అనుమతి

తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్‌కు భారీ ఊరట లభించింది. మహబూబాబాద్ లో ఈ నెల 25న ఉదయం పది గంటలకు నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.వెయ్యి మంది రైతులతో ధర్నా నిర్వహించేందుకు బీఆర్ఎస్‌కు కోర్టు అనుమతించింది.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నాను ఈరోజు (నేడు) చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. కానీ పోలీసులు అనుమతించలేదు. దీంతో ఈ నెల 25న చేపట్టాలని నిర్ణయించింది. ఈ గిరిజన, రైతు ధర్నాకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో ప్రతిపక్షానికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

## ఈ సంస్థ ద్వారా రానున్న మూడేళ్లలో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు: శ్రీధర్ బాబు

రఘువంశీ ఏరోస్పేస్ సంస్థ రానున్న మూడేళ్లలో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. శంషాబాద్ ఏరో స్పేస్ పార్క్‌లో రఘువంశీ ఏరోస్పేస్ కొత్త కర్మాగార నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎంఎస్ఎంఈ విధానం ద్వారా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. రూ.300 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కర్మాగారాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. రఘువంశీ ఏరోస్పేస్ ఎయిర్ బస్, బోయింగ్‌తో పాటు పలు ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థలకు కీలకమైన విడిభాగాలను సరఫరా చేస్తోందన్నారు. 2002లో చిన్న పరిశ్రమగా ప్రారంభమైన రఘువంశీ ఏరోస్పేస్ ఇప్పుడు ఈస్థాయికి ఎదిగి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింప చేసిందన్నారు. డీఆర్డీవో, ఇస్రో, హెచ్ఏఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థలకు పరికరాలను, విడిభాగాలను అందిస్తోందన్నారు.

## రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా నిలిచిపోయిన విద్యుత్... బీజేపీ చురక

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న మీడియా సమావేశంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఆయన మాట్లాడుతుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయన మాట్లాడేందుకు కాసేపు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత రాహుల్ గాంధీ మాట్లాడుతూ... ప్రస్తుతం ఈ కరెంట్ కోతకు అదానీ పవర్, మోదీ పవర్ కారణమని ఆరోపించారు.రాహుల్ సమావేశంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించింది. ప్రధాని మోదీ గురించి రాహుల్ గాంధీ అబద్ధాలు చెప్పారని, ఆయన ప్రెస్ మీట్‌లో కాసేపటికే కరెంట్ వచ్చిందని బీజేపీ నేత సంబిత్ పాత్ర గుర్తు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతున్న సమయంలో ఆ పార్టీ నేత జైరాం రమేశ్ కూడా పక్కనే ఉన్నారని... రాహుల్ ను ఆపలేక ఆయనే విద్యుత్ ప్లగ్‌ను తీసేసి ఉంటారని ఎద్దేవా చేశారు.త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం కలిగించేందుకు కొవిడ్ సహా ఎన్నో అంశాల గురించి అవాస్తవాలను మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు అదానీ వ్యవహారాన్ని రాహుల్ గాంధీ వినియోగించుకుంటున్నారని విమర్శించారు.

## అమెరికా కేసు ఎఫెక్ట్... 'అదానీ'కి షాకిచ్చిన కెన్యా ప్రభుత్వం

గౌతమ్ అదానీకి కెన్యా షాకిచ్చింది. గౌతమ్ అదానీకి ఇవ్వదలిచిన ఎయిర్‌పోర్ట్ టెండర్‌కు బ్రేక్ పడింది. లంచం ఆరోపణలపై అమెరికాలో అదానీ గ్రూప్‌పై కేసు నమోదైన నేపథ్యంలో కెన్యా ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్ట్, విద్యుత్ సరఫరా లైన్ల కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్లు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం వెల్లడించారు.విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణానికి పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం కింద ముప్పై ఏళ్లకు కెన్యా ప్రభుత్వం 736 మిలియన్ డాలర్లకు అదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ అమెరికాలో కేసు ఘటన నేపథ్యంలో ఈ ఒప్పందంపై కెన్యా ప్రభుత్వం వెనక్కి వెళ్లింది.కెన్యాలోని ప్రధాన విమానాశ్రయమైన జోమో కెన్యాట్టా అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి కోసం అదానీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రభుత్వం ఆ ప్రాజెక్టును తాత్కాలికంగా నిలుపుదల చేసింది. తాజాగా, పూర్తిగా రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

TELANGANA SHASANA SABHA
శాసనసభ
శుక్రవారం 22 నవంబర్ - 2024




# 'పుష్ప2' శ్రీలీల 'కిస్సిక్'.. సాంగ్ రిలీజ్ ఎప్పుడంటే?

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్' .రష్మిక కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రం విడుదల కానుంది. ఇందులోని ఓ ప్రత్యేక గీతంలో కథానాయిక శ్రీలీల ఆడిపాడుతున్న సంగతి తెలిసిందే. 'కిస్సిక్' అంటూ సాగే ఈ డ్యాన్స్ ఐటమ్‌ను నవంబరు 24న రాత్రి 7.02 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం సరికొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఇందులో అల్లు అర్జున్ కాలిపై శ్రీలీల ఏటవాలుగా పడుకొని ఉన్న స్టిల్ అలరిస్తోంది.ఆ సినిమాలో చిరు అలా చేయలేకపోయారు.. అందుకే చరణ్‌తో చేయించా!ఇప్పటికే 'పుష్ప2' చిత్రీకరణ దాదాపు పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని కూడా వేగంగా పూర్తి చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రత్యేకగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఆ పాటలో ఆడిపాడే కథానాయిక అంటూ పలువురు తారల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆ అవకాశాన్ని మాత్రం శ్రీలీల సొంతం చేసుకుంది. తొలి చిత్రంలోని 'ఊ అంటావా...'కి దీటుగా ఇందులో 'కిస్సిక్...' పాట ఉంటుందని, శ్రీలీలతో కలిసి అల్లు అర్జున్ వేసిన డ్యాన్స్, ఆయన శ్వాగ్ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేశారు. పట్నాలో నిర్వహించిన ఈవెంట్ సూపర్‌హిట్ అయింది. ఇక కోల్‌కతా, చెన్నై, కొచ్చి, బెంగళూరు, ముంబయి నగరాలకి వెళ్లనుంది చిత్రబృందం. హైదరాబాద్‌లోనూ ఓ వేడుకని నిర్వహించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చిన ఈ మూవీలో ఫహద్ ఫాజిల్, జగపతిబాబు, సునీల్, అనసూయ, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# IFFI 2024లో రెడ్ కార్పెట్ పై నాగ చైతన్య, శోభిత ధూళిపాళ




55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (IFFI) నిన్న గోవాలోని పనాజీలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది, వివిధ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.వారిలో అక్కినేని ఫ్యామిలీ రెడ్ కార్పెట్‌పై అద్భుతంగా కనిపించింది. దివంగత లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు (ANR)కి హృదయపూర్వక నివాళిలో భాగంగా IFFI అతని ఐకానిక్ చిత్రం దేవదాసు (1953)ని ప్రదర్శించింది. ఈ ప్రత్యేక క్షణాన్ని పురస్కరించుకుని, అక్కినేని నాగార్జున తన కుటుంబంతో కలిసి అక్కినేని అమల మరియు అక్కినేని నాగ చైతన్యతో సహా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరితో పాటు నాగ చైతన్యకు కాబోయే భార్య శోభితా ధూళిపాళ కూడా తోడైంది. ANR యొక్క టైమ్‌లెస్ క్లాసిక్‌ని చూసే ముందు అక్కినేని కుటుంబం కలిసి రెడ్ కార్పెట్ మీద నడిచింది వారి ఫోటోలు ఆన్‌లైన్‌లో త్వరగా వైరల్ అవుతున్నాయి. సంబంధిత గమనికలో, నాగ చైతన్య మరియు శోభిత ధూళిపాళ వివాహం డిసెంబర్ 4, 2024 న హైదరాబాద్‌లో జరుగుతుందని ధృవీకరించబడింది. త్వరలో పెళ్లికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

# ఫోన్ కాల్స్ బెడద.. 'అమరన్' టీమ్‌ను రూ.కోటి పరిహారం కోరిన విద్యార్థి




శివ కార్తికేయన్ సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్' రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్ నిర్మించారు.ఇటీవల విడుదలైన ఈ సినిమా వల్ల తనకు ఇబ్బంది కలిగిందని పేర్కొంటూ విఘ్నేశన్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి చిత్రబృందానికి లీగల్ నోటీసులు పంపించాడు. గుర్తు తెలియని వ్యక్తులు, ముఖ్యంగా సాయిపల్లవి ఫ్యాన్స్ నుంచి తనకు ఫోన్ కాల్స్ వస్తున్నాయని దీని వల్ల ఇబ్బందిపడుతున్నానని, మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్నాడు. నష్టపరిహారంగా రూ.1.1 కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ప్రస్తుతం ఇది కోలీవుడ్‌లో చర్చకు దారి తీసింది.మోస్ట్ పాపులర్ నటీనటుల జాబితాలో టాప్‌లో సమంత, ప్రభాస్..మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కిన చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. ముకుంద్ వరదరాజన్ (శివ కార్తికేయన్), ఇందు రెబెకా వర్గీస్ (సాయిపల్లవి) నటించారు. ఇందులోని ఒక సన్నివేశంలో సాయిపల్లవి హీరోకు తన ఫోన్ నంబర్ ఇస్తుంది. దీని కోసం చిత్రబృందం ఒక నంబర్ ఉపయోగించింది. సినిమా విడుదలయ్యాక.. సాయిపల్లవి ఫోన్ నంబర్ అదేనని భావించిన పలువురు అభిమానులు కాల్స్ చేయడం మొదలుపెట్టారు. సినిమాలో చూపించిన నంబర్ తనదేనని.. వరుస ఫోన్ కాల్స్, సందేశాల వల్ల తనకు వ్యక్తిగత ప్రశాంతత లేకుండా పోయిందని విఘ్నేశన్ పేర్కొన్నాడు. దీనివల్ల తాను కుటుంబసభ్యులతో సరిగా సమయాన్ని గడపలేకపోతున్నానని చెప్పాడు. తన ఫోన్ నంబర్ ఉపయోగించినందుకు చిత్రబృందం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.





# మోస్ట్ పాపులర్ నటీనటుల జాబితాలో టాప్‌లో సమంత, ప్రభాస్..

ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తాజాగా మోస్ట్ పాపులర్ నటీనటుల జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ నెలలో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన హీరో-హీరోయిన్ల లిస్ట్‌ను తాజాగా ప్రకటించింది.ఇందులో హీరోయిన్స్ జాబితాలో సమంత టాప్ వన్‌లో నిలవగా.. హీరోల లిస్ట్‌లో మొదటిస్థానంలో ప్రభాస్ ఉన్నారు. కొన్ని రోజులుగా వరుస సినిమా అప్‌డేట్‌లతో ప్రభాస్ సందడి చేస్తుండడంతో ఆయన టాప్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ స్టార్ హీరో నటించిన చిత్రాలు వరుసగా అలరించేందుకు సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో రానున్న నెలల్లోనూ ప్రభాసే టాప్‌లో కొనసాగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఇక హీరోల జాబితాలో రెండులో కోలీవుడ్ హీరో విజయ్, మూడులో షారుక్‌ఖాన్ ఉన్నారు.హీరోయిన్ల లిస్ట్‌లో గత నెలలో టాప్‌లో ఉన్న సమంత అక్టోబర్‌లోనూ అదే స్థానంలో ఉన్నారు. దీంతో వరుసగా రెండు నెలలపాటు ఆర్మాక్స్ మోస్ట్ పాపులర్ హీరోయిన్‌ల జాబితాలో టాప్ వన్‌లో ఉన్న సెలబ్రిటీగా రికార్డు సృష్టించారు . గత నెలలో 'సిటాడెల్: హనీ బన్ని' ప్రమోషన్స్‌లో బిజీగా ఉండడం.. వరుస ఇంటర్వ్యూలతో ఆ వెబ్ సిరీస్‌కు సంబంధించిన విశేషాలు పంచుకోవడంతో టాప్‌లో ఉన్న సామ్.. ఇటీవల ఆ సిరీస్ ప్రేక్షకుల ముందుకువచ్చి ప్రశంసలు అందుకోవడంతో మొదటిస్థానంలోనే ఉన్నారు. దీంతో ఆమె అభిమానులు సంబరపడుతున్నారు. రెండో స్థానాన్ని 'జిగ్రా'తో పలకరించిన అలియాభట్ సొంతం చేసుకున్నారు. టాప్3లో నయనతార నిలిచారు. ఆర్మాక్స్‌లో టాప్ టెన్‌లో నిలిచిన నటీనటులు వీరే.

# చైనా మాస్టర్స్.. క్వార్టర్ ఫైనల్స్‌కు లక్ష్యసేన్.. నిరాశపర్చిన సింధు



చైనా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు.మరో స్టార్ షట్లర్ పి.వి.సింధు ప్రిక్వార్టర్స్‌లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సాత్విక్, చిరాగ్‌శెట్టి జంట కూడా క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-6, 21-18తో రాస్మస్ జెమ్‌కే (డెన్మార్క్)పై విజయం సాధించాడు. వరుసగా గేమ్‌ల్లో ప్రత్యర్థిని చిత్తు చేసి 46 నిమిషాల్లోనే మ్యాచ్‌ని ముగించాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ 19వ ర్యాంకర్ అయిన పి.వి.సింధు నిరాశపర్చింది. గంట తొమ్మిది నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 16-21, 21-17 21-23తో యో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓటమి చవిచూసింది.పురుషుల డబుల్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ద్వయం 21-19,21-15 తేడాతో రాస్మస్ క్జెర్, ఫ్రెడరిక్ సోగార్డ్ (డెన్మార్క్)పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. 16-11, 11-21తో చైనాకు చెందిన లియు షెంగ్ షు, టాన్ నింగ్ జంట చేతిలో ఓటమి చవిచూసింది. ఈ టోర్నీలో భారత యువ షట్లర్లు అనుపమ ఉపాధ్యాయ, మాళవిక బన్సోద్‌ల పోరాటం కూడా ముగిసింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 7-21, 14-21తో నట్సుకి నిదైరా (జపాన్) చేతిలో ఓడిపోగా.. మాళవిక 9-21, 9-21తో ఎనిమిదో సీడ్, సుపానిడా (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది.

# ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్.. విరాట్ కోహ్లీ ఒక్కసారి సెంచరీ చేస్తే..: పుజారా



(నవంబర్ 22) నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది.ఈ సిరీస్‌లో దృష్టి అంతా విరాట్ కోహ్లీ పైనే ఉంది. ఎందుకంటే ఇటీవల టెస్టు క్రికెట్‌లో అతడు ఫామ్‌లో లేడు. కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో 93 పరుగులే చేసి నిరాశపర్చాడు. దీంతో కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో అతడు ఎలా ఆడతాడో? అని టీమ్‌ఇండియా అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే, ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో కోహ్లీ రాణిస్తాడని టీమ్‌ఇండియా టెస్టు స్పెషలిస్టు ఛెతేశ్వర్ పుజారా ధీమా వ్యక్తం చేశాడు. గతంలో ఆస్ట్రేలియాలో ఆడిన అనుభవం ఈ సిరీస్‌లో కోహ్లీకి ఉపయోగపడుతుందన్నాడు.

"గత అనుభవం కోహ్లీకి కచ్చితంగా ఉపయోగపడుతుంది. ఆస్ట్రేలియాపై అతను చేసిన పరుగులే ఇందుకు నిదర్శనం. ఆస్ట్రేలియాలోనే కాదు ఏ ఫార్మాట్‌లోనైనా ఎక్కడ మ్యాచ్‌లు ఆడినా విరాట్‌పై భారీ అంచనాలు ఉంటాయి. ఎన్నో మ్యాచ్‌లు ఆడటం వల్ల అతనిపై భారం పడుతుంది. కోహ్లీ ఎంత అద్భుతమైన ఫీల్డరో మనందరికి తెలుసు. నిరంతరం హార్డ్ వర్క్ చేస్తాడు. తగినంత విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడుతూనే ఉంటే శరీరం అలసిపోతుంది. సరైన ఏకాగ్రత కూడా ఉండదు. ఇప్పుడు కోహ్లీ కొంత విశ్రాంతి తీసుకున్నాడు. మానసికంగా, శారీరకంగా చాలా మెరుగైన స్థితిలో ఉన్నాడు. పోటీతత్వాన్ని విరాట్ ఇష్టపడతాడు. మైదానంలో తానెంటో నిరూపించుకోవాలనుకుంటాడు. ఆస్ట్రేలియా పరిస్థితుల్లో ప్రత్యర్థి అతనిని కలవరపెట్టడానికి ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాడు. ఈ విధానమే కెరీర్ ప్రారంభం నుంచి అతను సక్సెస్ కావడంలో కీలకపాత్ర పోషించింది. ఈ పర్యటనలో మొదటి రెండు మ్యాచ్‌లు కీలకం. అతను లయను అందుకోవడానికి క్రీజులో సమయం గడపడం చాలా అవసరం. కోహ్లీ మంచి ఆరంభాన్ని అందుకుని 50, 60 పరుగులు చేసి దానిని శతకంగా మలిస్తే సిరీస్ ఆసాంతం అదే జోరు కొనసాగిస్తాడు" అని పుజారా వివరించాడు.

# పెర్త్‌లో తొలి టెస్టు.. ఆస్ట్రేలియాకు వెళ్లనున్న రోహిత్ శర్మ!




ఆస్ట్రేలియా, భారత్ మధ్య నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ ప్రారంభంకానుంది.పెర్త్ వేదికగా తొలి టెస్టు జరగనుంది. తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ లేకుండానే టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. భార్య రెండో బిడ్డను ప్రసవించడంతో అతను స్వదేశంలోనే ఉండిపోయాడు. రెండో టెస్టు ఆరంభానికి ముందు రోహిత్ ఆస్ట్రేలియాలో భారత జట్టుతో కలుస్తాడని మొన్నటివరకు ప్రచారం జరిగింది. అయితే, తొలి టెస్టు జరుగుతున్న సమయంలోనే అతను ఆసీస్‌కు బయలుదేరనున్నాడని సమాచారం. మొదటి టెస్టు, రెండో టెస్టుకు మధ్య చాలా రోజుల సమయం ఉండటంతో ముందుగానే జట్టుతో కలుస్తానని బీసీసీఐకి రోహిత్ సమాచారమిచ్చాడట."రోహిత్ నవంబర్ 23న ముంబయి నుంచి బయలుదేరాల్సి ఉంది. అతను 24న పెర్త్ చేరుకుంటాడు. తర్వాత అడిలైడ్‌లో జరిగే డే-నైట్ (పింక్ బాల్) టెస్టుకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై కోచింగ్ స్టాఫ్‌తో చర్చిస్తాడు.కాన్‌బెర్రాలో జరగనున్న ప్రాక్టీస్ మ్యాచ్‌కు రోహిత్ అందుబాటులో ఉంటాడు" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తొలి టెస్టు ముగిసిన అనంతరం ఆస్ట్రేలియా దేశవాళీ జట్టయిన ప్రైమినిస్టర్స్ ఎలెవన్‌తో భారత్ 'ఎ' జట్టు తలపడనుంది. రెండు రోజులపాటు జరిగే ఈ వార్మప్ మ్యాచ్ నవంబర్ 30న ప్రారంభమవుతుంది. మ్యాచ్ ప్రాక్టీస్ కోసం రోహిత్ ఈ మ్యాచ్‌లో ఆడతాడు. డిసెంబరు 6 నుంచి ఆసీస్, భారత్ మధ్య పింక్ బాల్ టెస్టు మొదలవనుంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918

P. Rajesh
9866334557, 9100900931
polagonirajeshgoud@gmail.com
PMR
BUILDING PLANNER
House Planning, Building permission, HMDA & DTCP Layout Permission
Estimation, Home Loans, Valuations, Construction Drawings
Turkayamjal Village Road, Near Reddy Chicken Center



తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| శుక్రవారం 22 నవంబర్ - 2024 || పేజీలు : 4

# వణికిస్తున్న చలికాలం - ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- బయటికి వెళ్లేటప్పుడు ఉన్ని దుస్తులు తప్పనిసరి.
- ఆహారమైన, నీరైనా గోరువెచ్చగా తీసుకోండి.
- అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యుల సలహాలు పాటించాలి.







**శాసన సభ న్యూస్ (స్టేట్ నెట్వర్క్ ఇన్చార్జ్ పి.వెంకటేష్) :** గత రెండ్రోజులుగా రాష్ట్రంలో పెరుగుతున్న చలి. ఈ నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులకు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్నారు నిపుణులు.రోజురోజుకు చలి బాగా పెరరుగుతోంది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రత 20 డిగ్రీలకన్నా దిగువకు పడిపోతోంది. ముఖ్యంగా అటవీ ప్రాంతాలలో ఎక్కువగా వ్యాపించి, ఇతర ప్రాంతాల్లో మరింత చలి పంజా విసురుతోంది. ఈ నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. చలి కాలంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని,మంచు విపరీతంగా ఉండటం వల్ల మనిషి రక్త నాళాలు, కండరాలు కుచించుకుపోయి పలు రకాల వ్యాధులకు గురవుతుంటారని అంటున్నారు. ఈ సమయంలో ప్రతి ఏడాది ఆసుపత్రుల్లో వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుండుటమే దీనికి నిదర్శనం. ఇప్పటికే నిత్యం వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నట్టు తెలుస్తోంది. శీతాకాలంలో ప్రారంభంలోనే గాలిలో వచ్చే మార్పులకు జ్వరం, జలుబు, తలనొప్పి, దగ్గు, శ్వాస కోశ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ చలి కాలం జనవరి వరకు ఉంటుంది. ముఖ్యంగా డిసెంబరులో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. శీతాకాలంలో ఎక్కువగా జలుబు అయి ముక్కు కారుతుంటుంది.దీంతో చెవి దగ్గర గడ్డలా వాపు వచ్చే అవకాశాలు సైతం ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల శ్వాస తీసుకోవడం సమస్యగా మారుతుంది. కండరాలు బిగుసుకుపోవడంతో మోచేయి, మోకాలు, ఇతర జాయింట్‌లలో నొప్పులు వస్తుంటాయి. రక్తనాళాలు కుచించుకుపోతే గుండెకు బ్లడ్ సర్క్యులేషన్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయి. ఇది చాలా ప్రమాదకరం. శ్వాస నాళిక కండరాలు బిగుసుకు పోతాయి. దీంతో గాలి పీల్చడంలో ఇబ్బంది ఉంటుంది. ఆస్తమా ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ ఇబ్బందిగా ఉంటే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి.'చలి కాలంలో చల్లటి పదార్థాలు కాకుండా వేడి ఆహారపదార్థాలను, వేడి నీళ్లను మాత్రమే తీసుకోవాలి. చర్మసంబంధమై వ్యాధులు నుంచిదూరంగా ఉండేందుకు మాయిశ్చరైజర్ వాడాలి. ఏదైనా అనారోగ్య సమస్యగా కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.చలికాలంలో కూల్‌గా ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడివేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. శరీరం వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.ఐస్‌క్రీం, చల్లగా ఉన్న నీళ్లను, జూస్‌ను తాగడం వల్ల జలుబు, శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. వాటికి దూరంగా ఉండాలి.శరీరానికి వేడినిచ్చే జొన్నలు, ఆకుకూరలు, సజ్జలు వంటి ఆహారంగా తీసుకోవాలి. గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలి.రాత్రి వేళలో బయటకు వెళ్లకుండా ఉండాలి. అత్యవసరం అయితే తప్పనిసరిగా చలి నుంచి శరీరాన్ని రక్షించే ఉన్ని దుస్తులు ధరించాలి. చెవుల్లోకి చల్లని గాలి వెళ్లకుండా రక్షణ కలిగించే దుస్తులు వేసుకోవాలి.చిన్న పిల్లలను బయటకు వెళ్లనీయకుండా కుటుంబ సభ్యులే పలు జాగ్రత్తలు తీసుకోవాలి.చలికాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఇంట్లో వైరస్‌లు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. అందుకు ఇంట్లో, ఇంటి పరిసరాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలి.తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలి. జలుబు, దగ్గు ఉన్న వారు తప్పనిసరిగా చేతిరుమాలు వెంట పెట్టుకుని అడ్డుపెట్టుకోవాలని, చలికాలం వెళ్లే వరకు తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు, నిపుణులు సూచిస్తున్నారు.

# గ్రూప్ - 2 పరీక్షలపై కీలక ప్రకటన




**చండూర్ నవంబర్ 21 (శాసనసభ న్యూస్) :** తెలంగాణ లో డిసెంబర్ 15,16 తేదిన లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తామని టిజిపిఎస్సి ప్రకటించింది. రోజుకు రెండు సెషన్ల (ఉ.10-12:30, మ. 3-5:30 వరకు) లో పరీక్ష నిర్వహిస్తారు. డిసెంబర్ 9 నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఉదయం 8:30 నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని టిజిపిఎస్సి పేర్కొంది. ఇతర వివరాల కోసం,040-23542185 లేదా 040-23542187 నంబర్ల కు ఫోన్ చేయండి.

# చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో మండల

## మొదటి స్థానం సాధించిన గాంధీజీ విద్యార్థులు

### - చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ చాటిన గాంధీజీ విద్యార్థులు

### - చెకుముకి టాలెంట్ టెస్ట్ లో విజేతలకు ఘన సన్మానం

**చండూర్ నవంబర్ 21 (శాసనసభ న్యూస్) :** జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు-2024 కార్యక్రమంలో భాగంగా బాలబాలికల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం నిర్వహించే మండల స్థాయి టాలెంట్ పోటీ పరీక్షలలో చండూరు మండలంలోని అన్ని పాఠశాలలు పాల్గొనగా, గాంధీజీ విద్యాసంస్థలకు చెందిన పందిరి శివప్రియ (10 వ తరగతి), శిరంశెట్టి అక్షర (9వ తరగతి) , యం.ఇందు (8వ తరగతి) విజయదుందుభి మ్రోగించి



మండల మొదటి స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలను ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అభినందించి, జ్ఞాపికలను అందచేసారు. ఈ నెల 28 వ తారీఖున జిల్లా కేంద్రం నల్లగొండలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో విజయం సాధించి, రాష్ట్ర స్థాయిలో గాంధీజీ పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయకుమారి,యాదగిరి, విజయ్, తదీతరులు పాల్గొన్నారు.

# పూసల సంఘం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## బీసీ కమిషనర్ నీ మర్యాదపూర్వకంగా కలిసిన పూసల సంఘం నాయకులు

## డీ ఎన్ టి లో చేర్చాలని డిమాండ్





**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 21) :** తెలంగాణ రాష్ట్రంలో పూసల కార్మికులను, సంచార జాతులతో కేంద్రంలో డి ఎన్ టి చేర్చాలని, బీసీ కమిషన్ ని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని పూసల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహారాష్ట్ర, తమిళనాడులో పూసలళ్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా డీ ఎన్ టి లో చేర్చాలని డిమాండ్ చేశారు. పూసల్లోలు వెనుకబడిన జాతి వారు.. గ్రామ గ్రామాన రోడ్డు మీద చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని బొట్టు బిల్లలు, కాటిక కాయలు, రాజులు, పుస్తల తాడులు, దువ్వెనలు, అద్దాలు అమ్మకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. పురుషులైతే తాళం చెవులు, గొడుగులు, గ్యాస్ స్టవ్లు రకరకాల వస్తువులతో వ్యాపారం చేసుకుంటారు. తమ పిల్లల చదువుల కోసం తన కుటుంబం బ్రతికేది కష్టమని భావించారు. అటువంటి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పూసల సంఘం అధ్యక్షులు నూతన కంటి సదానందం, ప్రధాన కార్యదర్శి పొదిలి రాజశేఖర్, ఉపాధ్యక్షులు గుండ్లపల్లి మురళి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ నూతన కంటి శేఖర్, జిల్లా కోశాధికారి పన్నీర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు పోలపల్లి కోటయ్య, పద్మ, అందాలు, మహేందర్, చందు, భాస్కర్, నరసింహ, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మారని మత్స్యకారుల బ్రతుకులు

### వేటకు వెళ్తే గాని పూట గడవని బ్రతుకులు

### యాచారం మండల కేంద్రంలో ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

### మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ముదిరాజ్

**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 21) :** ప్రపంచవ్యాప్తంగా మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా యాచారం మండల కేంద్రంలో మత్స్యకారుల మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. గురువారం ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న మత్స్యకారుల జీవన విధానం రోజురోజుకు అలాగనే కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేసిన ఇప్పటికీ తన కుటుంబాలు పూటకు కడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల ను పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కరువు తాండవిస్తుంది. వర్షాలు రాక చెరువుల కుంటలు నిండక, ఉన్న చెరువులో భూగర్భ జలాలు అడుగంటి పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మత్సకారులకు సబ్సిడీ రుణాలు అమలు చేసి,



ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కానమోని గణేష్, యూత్ అధ్యక్షులు గోదాస్ మహేందర్, సామరాములు, నూక మహేందర్ మేకప్ శంకర్, గుండ మౌని గణేష్, పెద్దమోని నరేష్ ,యర జంగయ్య, ఆగపల్లి వినోద్, యార యాదయ్య ,ఎడ్ల నరసింహ, చిన్న మౌని శ్రీరాములు, యాదయ్య, కొండల్, నీల మహేందర్ ,పాండు, శ్రీరాములు, కేశవులు, జంగయ్య మల్లేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలమర్రి రఘుపతి భౌతికకాయానికి

## నివాళులు అర్పించిన - సిపిఎం కమిటీ సభ్యులు

**చండూర్ నవంబర్ 21 (శాసనసభ న్యూస్) :** చౌటుప్పల్ మండలం పరిధిలోని నేలపట్ల గ్రామ వాస్తవ్యులు పిల్లలమర్రి రఘుపతి మృతి చెందడంతో ఆయన భౌతికాయానికి నివాళులర్పించి పుష్పగుచ్చాలు అందించిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపెల్లి బసీతారాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జాంగిర్, ఉన్నారు.పిల్లలమర్రి రఘుపతి చేనేత రంగానికి అనేక సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి చేనేత రంగానికి తీరనిలోటని అన్నారు.నివాళులు అర్పించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు తడక మోహన్, బండారు నరసింహ, దబ్బటి బక్కయ్య, తడక రామాంజనేయులు, బత్తుల శంకర్,తడక చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

## - బీమనపల్లి సైదులు

**చండూర్ నవంబర్ 21 (శాసనసభ న్యూస్) :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీమనపల్లి సైదులు చేతుల మీదుగా జాజుల ప్రభాకర్ రూ21000/-, పంతంగి శేఖర్ రూ14000/- లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మనుకుంట్ల పరమేష్, పంతంగి రవి, మునుకుంట్ల గోపాల్, జాజుల నరసింహ, ఈరట్టు వీరేష్, భీమనపల్లి కిష్టయ్య, మహేశ్వరం యాదయ్య, బండమీది సైదులు,




లింగాల శేఖర్, పంతంగి పరమేష్, మునుకుంట్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పైప్ లైన్ సైజు పెంచి తొర్రూర్ రోడ్డు వరకు వేయాలి

### - సిపిఎం నాయకులు ఎం. సత్యనారాయణ, పొట్టేలు శ్రీనివాసులు.

**తుర్కయంజాల్, శాసనసభ న్యూస్ నవంబర్ 21 :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోనీ కమ్మగూడ నుండి మస్కతిడైరీ మీదుగా 22వ వార్డ్ ముగింపు సుందరయ్య నగర్ కాలనీ వరకూ మాత్రమే చేస్తున్న అంతర్గత డ్రైనేజీ పైప్ లైన్ ను మునగనూర్ చెరువు వరకు తొలగించాలని కోరుతూ గురువారం సిపిఎం ఆద్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయాంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని కమ్మగూడ గ్రామంలోని 22వ వార్డు సాయిప్రియ నగర్, మస్కతి డైరీ, హైకోర్టు కాలనీ, ప్రగతి నగర్ కాలనీ, నవ భారత్ కాలనీ, ఆర్టిసి కాలనీ తదితర చుట్టుపక్కల కాలనీల నుంచి వస్తున్న డ్రైనేజ్ వాటర్ పైప్ లైను సుందరయ్య కాలనీ దగ్గరలో వదిలేయడం జరిగిందని దీంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో మురుగనీరు జామై తీవ్ర దుర్వాసన వస్తుందనీ లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ ప్రజలు డెంగ్యూ లాంటి విష



జ్వరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే కాకుండా శ్రీనివాస కాలనీ, లక్ష్మీ నగర్,ఇందిరమ్మ కాలని, సుందరయ్య కాలని, శ్రీరంగాపురం ఆపిల్ ఎవెన్యూ కాలనీలో డ్రైనేజ్ వాటర్ కూడా ఇక్కడి నుండే వెళ్తుంది కనుక ఈపైప్ లైన్ సైజు పెంచి 23, 24వ వార్డుల గుండా తొర్రూరు రోడ్డు వరకు పొడిగించాలని పాలక వర్గాన్ని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మున్సిపల్ నాయకులు ఇంజాపూర్ జోన్ బాధ్యులు యం.సత్యనారాయణ, సుందరయ్య కాలనీ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి పొట్టేలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ రమణారెడ్డి





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 21 :** కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పాటించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి అన్నారు. గురువారం నాడు చింతపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని పి.పి.సి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. వరి ధాన్యాన్ని నాసిరకం, మేలు రకం నాణ్యత చూసే పరికరాలను వారు తీసుకుంటున్న ప్రమాణాలను, రైతులకు మౌలిక సదు-పాయాలను నిషితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ప్రమాణాలను కొలతల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేదని హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది కలిగించే విషయాలని దృష్టికి వస్తే వాటికి తగు చర్యలను తీసుకుంటామని, ధాన్యం ఆరబోసిన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు పొందుపరచిన రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పి.పి.సి సెంటర్ల ఇన్చార్జులు వినోద్, రఘునాథ్ రెడ్డి, ఏఈఓలు మౌనిక,అరుణ పాల్గొన్నారు.

# బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

### - తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్.






**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, (నెట్వర్క్ ఇన్చార్జ్ పివెంకటేష్) శాసనసభ న్యూస్ నవంబర్ 21 :** సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు.గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది.ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు ,సంస్థలతో విజ్ఞాపనాలను స్వీకరించిన అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు 7 విచారణలు పూర్తి చేయగా, ఇది 8 వ దని అన్నారు. ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు.బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బిసి కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునెందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం అని, దీనివల్ల రాష్ట్రంలో జనాభాలో బి సి లు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు.సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఇందులో 87,000 మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు ఇండ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్ లో లో పెట్టడం జరుగుతుందని చెప్పారు. అయితే ఈ సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని, సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న వారు ఎంత మందో తెలిస్తే మంచి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సమాజంలో బలహీనంగా ఉన్న వారి అభివృద్ధి కోరుకునే వారికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పటివరకు 65 నుండి 70% సర్వే పూర్తయిందని, రంగారెడ్డి జిల్లాలో 79.6%, మేడ్చల్ మల్కాజ్ గిరి 65.3%, వికారాబాద్ 74.5% సర్వే పూర్తి చేయడం పట్ల ఆయన అభినందించారు.అదేవిధంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలో సైతం సర్వే బాగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లాల యంత్రంగాలను అభినందించారు.గురువారం నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా విశ్వకర్మ ,బ్రాహ్మణ, పూసల, రజక, కుమ్మర, కమ్మరి ,ఉప్పర అన్ని కుల సంఘాలు, ఇతర సంఘాల వారు వచ్చి వారి బాధలను, వారి కోరికలను విన్నవించుకున్నారని అన్నారు.ఈ బహిరంగ చర్చలో 72 పిటిషన్లు అందాయని తెలిపారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీ కమిషన్ బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, బట్రాజ్ తదితర కులాలను బీసీ డీ నుండి ఏ కి మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆ పేరు పిలవడం మానేసి వంశ రాజ్ గా మాత్రమే పిలవాలని విజ్ఞాపనలు వచ్చాయని వాటన్నిటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని, బిసి కమిషన్ పై ఎలాంటి అపనమ్మకం అవసరం లేదని ఆయన తెలిపారు.ఉదయం బహిరంగ విచారణ ప్రారంభానికి ముందు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ప్రత్యేకించి మెడికల్ పాయింట్, రిజిస్ట్రేషన్ సెంటర్, అఫిడవిట్ ఏర్పాటు చేయడంతో పాటు, జిరాక్స్ ,అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.తన స్వాగతోపన్యాసం లో బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బీసీలకు అన్యాయం జరగరాదన్నదే బీసీ కమిషన్ బాధ్యతని, ఈ బాధ్యత నెరవేర్చడానికి తాము ఎంతైనా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు సమగ్ర కుటుంబ సర్వే పట్ల ఉన్న అపోహలను విడనాడి ఎన్యుమరేటర్లు అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. బీసీలలో ప్రస్తుతం చైతన్యం పెరిగిందని, సమాజంలో ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి మంచి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని ,దీంతో బీసీలకు మేలు చేసేందుకు అవకాశం ఉందని, ఈ విషయంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీలు మాట్లాడారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్, డి ఆర్ డి ఓ శ్రీలత, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ అధికారి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారులు,వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## శీగా ప్రభాకర్ గౌడ్ గుండెపోటుతో మృతి

### బిజెపి పార్టీ కి తీరని లోటు

### అంత్యక్రియలకు పలువురు నేతలు హాజరు






**యాచారం శాసనసభ న్యూస్ (నవంబర్ 21):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆదిపట్ల మున్సిపాలిటీ లో కొంగర కాలన్ గ్రామానికి చెందిన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, కర సేవకుడు, శీగా ప్రభాకర్ గౌడ్ బుధవారం రాత్రి 10:45 ని.. లకు గుండెపోటుతో మరణించారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , బిజెపి నాయకులు మాజీ భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, బోసు పల్లి ప్రతాప్, కొత్త అశోక్ గౌడ్, కౌన్సిలర్ పొట్టి రాములు, మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు శీగా వీరస్వామి వివిధ రాజకీయ పార్టీ నేతలు, పార్టీ కార్యకర్తలు ఆయన ప్రార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభాకర్ గౌడ్ బిజెపి పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసే పార్టీ పెద్దలకు గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీలో కీలకమైన బాధ్యతలు కూడా స్వీకరించారు. ఆయన లేనియెడల బిజెపి పార్టీకి తీరని లోటు అని నేతలు అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలకు ఆదిభట్ల మున్సిపాలిటీలో ఒక మంచి నాయకుని కోల్పోయామని కన్నీళ్ళతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పట్నం డిపోలో ప్రగతి రథచక్రాల అవార్డులు

### - డిపో మేనేజర్ వెంకట నర్సప్ప



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 21 :** ఇబ్రహీంపట్నం డిపోలో ఆర్టీసీ ఎండి గారి ఆదేశానుసారం ప్రతినెల జరుగు ప్రగతి చక్రం అవార్డులు, క్యాష్ అవార్డులు డి.ఎం వెంకట నరసప్ప చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ స్టేట్ లెవెల్ లో ఇబ్రహీంపట్నం డిపో 2002- 2003 సంవత్సరంలో మూడోస్థానము, 2003 -2004లో రెండవ స్థానానికి మీ అందరి కృషితో రావడం జరిగినది అని ఉద్యోగస్తుల సేవలను కొనియాడారు. అందరి సమిష్టి కృషితో 2024- 2025 సంవత్సరంలో మన డిపోను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిల్పాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకట నరసప్ప, అసిస్టెంట్ మేనేజర్, కే .రాజేష్, ఏఎంఎఫ్ కృష్ణారెడ్డి, వెల్ఫేర్ కమిటీ మెంబర్లు, సూపర్వైజర్లు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి చెక్ ముకి టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ చాటిన విద్యార్థులు





**చండూర్ నవంబర్ 21 (శాసనసభ న్యూస్) :** నల్లగొండ జిల్లా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మునుగోడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోరంట్ల సుధాకర్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్ కు సమన్వయకర్తగా వ్యవహరించిన గేర నర్సింహ మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను నిర్మూలించడానికి విజ్ఞానాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని మండల స్థాయిలో నిర్వహించిన ఈ టాలెంట్ పరీక్షకు మండలంలోని 11 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలివెల విద్యార్థులు చెరుకు సాహితీ, నల్లబెల్లి మణిధర్, కొమ్మనపల్లి ప్రజ్ఞ జిల్లాస్థాయి చెకుముకి టెస్ట్ కు ఎంపికయ్యారు. అదేవిధంగా తెలుగు మీడియంలో మునుగోడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీనివాస్, ఈశ్వర్, వెంకటేష్ గురుకుల విభాగం నుండి కళ్యాణి, స్వాతి, కావ్య ప్రైవేట్ పాఠశాల విభాగం నుండి సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు లాస్య శ్రీ, సాక్షిత్ రెడ్డి ,మహేంద్ర లు మండలంలో ప్రథమ స్థాయిలో నిలిచారు. వీరికి ఈనెల 28- 11- 2024 న నల్లగొండలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ఉంటుందని పైన తెలిపిన విద్యార్థులు అందరూ నల్లగొండలో పరీక్షకు హాజరు కావాలని కోరారు. మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ మండలంలోని వివిధ పాఠశాలల నుండి 11 పాఠశాలల కు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి. రాములు, కల్లూరి స్వామి, పిట్టల నాగరాజు, సుధాకర్ రెడ్డి, ఆర్.స్వామి, బొజ్జ అంజయ్య, సబిత, మొదలైన వారు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ పరీక్ష



**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 21 :** జన విజ్ఞాన వేదిక చింతపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను చింతపల్లి మండల విద్యాధికారి నీరుడు అంజయ్య,జెడ్పిహెచ్ఎస్ చింతపల్లి ప్రధానోపాధ్యాయులు ఆర్ లక్ష్మి ఆవిష్కరించి పరీక్ష లు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నీరుడు అంజయ్య మాట్లాడుతూ సైన్స్ విజ్ఞానం ద్వారా విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగాలని అలాగే మూఢనమ్మకాలను విడనాడాలని తెలియజేశారు. ఈ చెకుముకి పరీక్ష నందు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వీటి నగర్,కురుమేడు, కురంపల్లి,వింజమూరు,గడియ గౌరారం,తీదేడు, చింతపల్లి, ప్రైవేటు పాఠశాలలు శాంతినికేతన్,మాతృశ్రీ, విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు.పరీక్ష అనంతరం జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ నల్ల నరసింహ్మా పరీక్ష ఫలితాలు ప్రకటిస్తూ ప్రభుత్వ విభాగంలో జడ్పీహెచ్ఎస్ వీటి నగర్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, ప్రైవేటు పాఠశాలల విభాగంలో శాంతి నికేతన్ వీటి నగర్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లుగా ప్రకటించారు. మొదటి స్థానాలలో నిలిచిన ఆయా పాఠశాలల విద్యార్థులు నవంబర్ 28, వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే జనవిజ్ఞాన వేదిక చెకుముకి పరీక్షల్లో పాల్గొనాలని తెలియజేశారు. మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా స్థాయికి ఎంపికకాబడిన పాఠశాలల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. చెకుముకి మండల స్థాయి పరీక్ష లలో పాల్గొన్న విద్యార్థులకు మండల విద్యాధికారి అంజయ్య,ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ,అప్రిషియేట్ సర్టిఫికెట్స్ అందజేసారు.చెకుముకి పరీక్షలకు ఆతిథ్యమిచ్చిన జడ్పీహెచ్ఎస్ చింతపల్లి ప్రధానోపాధ్యాయులకు పాఠశాల సిబ్బందికి వివిధ పాఠశాల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులకు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ నల్లనర్సింహ్మ ధన్యవాదములు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సుందరయ్య కృష్ణారెడ్డి ,అనంత్ రెడ్డి ,కిషన్ లాల్ ,యాదగిరి, నారాయణ, ఆనంద్ బాబు, వేణు, ఉషారాణి, చందులాల్ అమీర్ అలీ, సైదులు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి చౌరస్తాలో వాహన తనిఖీలు

### - వాహన తనిఖీల్లో ఒకరికి ఒకరోజు జైలు, 2000 జరిమాన, ఒకరిపై కేసు నమోదు.

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 21 :** హైదరాబాద్ - నాగార్జునసాగర్ ప్రధాన రహదారి 19 పై గురువారం నాడు వాహనాల తనిఖీల్లో ఒకరికి ఒకరోజు జైలు, 2,000 జరిమానా, మరొకరిపై కేసు నమోదు చేసిన సంఘటన చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం నాడు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా పట్టుబడిన ముదిగొండ గ్రామం ఎర్ర భాగ్య తండాకు చెందిన రమావతు రాముల కు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడినందువల్ల ఒకరోజు జైలు శిక్ష, రెండు వేల రూపాయలు జరిమాన స్పెషల్ జుడీసీఎల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ పొట్ట చెన్నయ్య విధించడం జరిగింది.అదేవిధంగా వాహనాల తనిఖీలో భాగంగా అదే రోజు గాజీనగర్ గ్రామం కొండ మల్లెపెల్లికి చెందిన బత్తుల యాదయ్య ఏపీ 24 వై 4507 నెంబరు గల ఆటోలో పరిమితికి మించి ఆటోలో 17 మంది ప్రయాణికులను (కూలీలను) ఎక్కించుకొని ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలిగించే విధంగా అతివేగంగా అజాగ్రత్తగా ఆటోను నడుపుతుండగా పట్టుబడి చేసి కేసు నమోదు చేయడం జరిగిందని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ బి యాదయ్య తెలిపారు.